ప్రజాశక్తి

ఆదివారం 27 ఆగస్టు 2023 5

శ్రీ సత్యసాయి

సమరభేరి కార్యక్రమ పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాసమస్యలపై ఆందోళనలు

◆ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి

◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ తెలిపారు. శనివారం నాయుడు సిపిఎం జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు నిర్వహించిన వివిధ ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి పాలన సాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారాలను వేస్తూ ప్రజల నడ్డివిరుస్తున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచి ఎడాపెడా భారాలు వేస్తున్నారన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను ఇవ్వకుండా రైతులను ఇబ్బందుల పాలుజేస్తున్నారన్నారు. వర్షాలు లేక జిల్లాలో పంటలు సాగు జరగలేదన్నారు. సాగు చేసిన అరకొర పంటలు వర్షాభావంతో ఎండిపోతున్నాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నష్ట పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. సత్యసాయి వాటర్ వర్కర్స్ సమస్యలను కూడా వెంటనే పరిష్కరించి వారి సమ్మెను విరమింపజేసేలా ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు చెప్పారు. ఆగస్టు 30, 31న ప్రజలతో సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1న సచివాలయాల అధికారులకు అర్జీల అందజేత, సెప్టెంబర్ 4న మండల కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ నాయకులు ఇఎస్.వెంకటేష్, జిఎల్.నరసింహులు, ఫిరంగి ప్రవీణ్ కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మూడుగంటల్లో ముగిసింది..!

◆ ముక్తసరి చర్చతోనే జెడ్పీ సాధారణ సమావేశం ◆ ఒక మంత్రి, ఒక ఎమ్మెల్యే మాత్రమే హాజరు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తీవ్రమైన కరువు పరిస్థితులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ముక్తసరి చర్చలతోనే ముగిసింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్నం రెండు గంటల్లోపు ముగిసింది. అంటే మూడు గంటల్లో జిల్లా స్థాయి సమస్యలపై చర్చ ముగియడం గమనార్హం. ఎప్పటిలాగానే ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎంపీల హాజరు నామమాత్రంగానే ఉంది. మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే అనంత మాత్రమే సమావేశంలో పాల్గొన్నారు. శనివారం ఉదయం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఈ సమావేశంలో రెండు జిల్లాల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో వైద్యం, గృహ నిర్మాణం, స్త్రీ శిశు సంక్షేమం, వ్యవసాయం ఈ నాలుగు అంశాలపైనే చర్చ జరిగింది. ఇందులో ప్రధానంగా ఎక్కువగా గృహ నిర్మాణంపైనే చర్చ జరిగింది. గృహ నిర్మాణాల్లో ఎదురవుతున్న సమస్యలను ఎంపిపిలు, జడ్పిటిసిలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు తెలియకుండానే రద్దు చేసారని వాటిని మంజూరు చేయాలని బెళుగుప్ప, ఉరవకొండ ఎంపిపిలు కోరారు. దీనిపై కలెక్టర్ గౌతమి స్పందిస్తూ ఇళ్ల నిర్మాణం అత్యంత ప్రాధాన్యమైనదని చెప్పారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసినా చాలా మంది

సమావేశంలో పాల్గొన్న ఎంపిపిలు, జెడ్పీటీసీలు (ఎమ్మెల్యేలు రాక ఖాళీగా ఉన్న ముందు కూర్చీలు)

లబ్ధిదారులు కట్టుకోవడానికి ముందుకు రావడం లేదని చెప్పారు. దీంతో కేంద్ర నుంచి వచ్చిన నిధుల వినియోగంలో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఇప్పుడు నడుస్తున్న ఇళ్ల త్వరితగతిన నిర్మించుకునే విధంగా లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించి ముందుకు నడిపితే మరిన్ని ఇళ్లు మంజూరు చేయించడానికి ఇబ్బంది లేదన్నారు. వైద్య శాఖపై జరుగుతున్న చర్చలో ఓడిసి, రొద్దం మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాలు ఆగిపోయాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సత్యసాయి జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి స్పందిస్తూ సాంకేతిక సమస్యతో నిర్మాణాలు ఆగిపోయాయని చెప్పారు. రోడ్లు భవనాల శాఖ నిర్మాణాలు చేపడుతోందన్నారు. సమస్యలు తెలుసుకుని పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు.

జిల్లాలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్న సమయంలోనూ సమస్యలపై చర్చించేందుకుగానీ, అధికారులకు మార్గ నిర్దేశాలు ఇచ్చేందుకు జెడ్పీ సమావేశం ఎంతో కీలకం. అలాంటి సమావేశానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషచరణ్ శ్రీ హాజరయ్యారు. మంత్రి కూడా సమావేశం

ఒక మంత్రి...ఒక ఎమ్మెల్యేనే హాజరు...

ముగియడానికి గంట ముందుగా మాత్రమే వచ్చారు. అంతకు మునుపు నుంచి ఉన్నది మాత్రం అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఒక్కరే. ప్రారంభం నుంచి చివరి వరకు ఆయన ఒక్కరే ఈ సమావేశంలో ఉన్నారు. తక్కిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఏ ఒక్కరూ హాజరవలేదు. జిల్లాకు సంబంధించి జరిగే అతి ముఖ్యమైన సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.

రాష్ట్ర సరిహద్దుల్లోనున్న రొళ్ల మండలానికి సరైన అధికారులే లేరని రొళ్ల ఎంపిపి ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు

అధికారులే లేరు.. అభివృద్ధి ఎలా :రొళ్ల ఎంపిపి

ఎంపిడిఒగా వచ్చేవారు కూడా లేరని అన్నారు. ఇప్పుడున్న ఎంపిడిఒ పగలే మద్యం సేవించి కార్యాలయంకు వస్తారని తెలిపారు. అటువంటి వ్యక్తితో ఏ విధంగా పనిచేయించుకోగలమని ప్రశ్నించారు. ఇప్పటికైనా మంచి అధికారులను తమకు నియమించాలని కోరారు.

కరువుపై నామమాత్రపు చర్చ..!

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకొన్న కరువు పరిస్థితుల గురించి రెండు జిల్లాల వ్యవసాయాధికారులు నివేదికను సమావేశంలో తెలిపారు. ప్రత్యామ్నాయ చర్యలేమైనా తీసు కుంటున్నారా అని సభ్యులు అడిగిన ప్రశ్నకు అధికారులు స్పందిస్తూ ఇప్పటికే ప్రత్యామ్నాయ విత్తనాలను ఇచ్చేందుకు సిద్ధం చేసామన్నారు. వర్షాలు లేకపోవడంతో ఆ విత్తనం తీసుకునేందుకు కూడా రైతులు ముందుకు రావడం లేదని తెలిపారు. కరువు మండలాలు ప్రకటించాలని కూడేరు జడ్పిటిసి అడిగారు. దానికి ఇంకా సమయం ఉందని, సెప్టంబరులోనూ ఇదే విధంగా ఉంటే నివేదికను ప్రభుత్వానికి పంపుతామని వ్యవసాయ అధికారులు తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ సమస్యలతో పంటలు ఎండిపోతున్నా ఆ సమస్యపై ఈ సమావేశంలో చర్చ జరగకపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, జాయింట్ కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈవో కేతన్ గార్గ్, శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ టీఎస్.చేతన్, అసిస్టెంట్ కలెక్టర్ కుషాల్ జైన్, జెడ్పీ డిప్యూటీ సీఈవో లలితాబాయితో పాటు ఉమ్మడి జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు, ఎంపిపిలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

మంత్రి ఉషశ్రీచరణ్

జెడ్పీ సమావేశంలో సభ్యులు తీసుకొచ్చిన సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని మంత్రి ఉషాశ్రీచరణ్ సూచించారు. ఉమ్మడి జిల్లాలో అంగన్వాడీలకు ప్రహరీ ఎక్కడ అవసరమవుతాయో పరిశీలన చేయాలన్నారు. ఎక్కడెక్కడ అద్దె గదుల్లో కేంద్రాలు నడుస్తున్నాయో గుర్తించి సంబంధిత సిడిపిఓల ద్వారా వాటి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి ఐసిడిఎస్ పీడీకి పంపించాలన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ఉమ్మడి జిల్లాని అభివృద్ధి పథంలో నడిపిద్దామని జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు కషి చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో 15వ ఫైనాన్స్ నిధులు రూ.20 కోట్ల కేటాయించి తాగునీరు, డ్రైనేజీలు, రహదారులు, తదితర అభివద్ధి పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి సాధించాలే సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆసుపత్రుల అభివృద్ధిపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే అనంత

నాడు, నేడు కింద ప్రభుత్వం పిహెచ్‌సిలు, ఆస్పత్రుల్లో చేపట్టిన అభివద్ధి పనులు, వచ్చిన మార్పులు, ఏరియా ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది నియామకం గురించి ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అధికారులకు సూచించారు. ఖరీఫ్ సీజన్లోని జూన్, జూలై నెలలో ఏఏ రకాల పంటలు ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు, ప్రస్తుతం ఏ రకమైన పంటలు సాగు చేయాలి అనే వివరాలను అధికారులు రైతులకు తెలియజేయాలన్నారు.

వైసిపిని మరోమారు ఆశీర్వదించండి

ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర

సిఎం జగన్ పారదర్శక పాలనను చూసి రాష్ట్ర ప్రజలు మరోమారు వైసిపిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పే స్వామి కోరారు. మండల పరిధిలోని మానూరు గ్రామ సచివాలయం పరిధిలోని ఎం.రంగాపురం, వైజిపి తండా గ్రామాల్లో శనివారం చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులు, స్థానిక వైసిపి ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి హయాంలో బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల కోసం చెప్పుకునే స్థాయిలో ఏ ఒక్క పథకమూ అమలు చేయలేదన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రభుత్వ ధనాన్ని దోచుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం సిఎం జగన్ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే వారికి కడుపు మండుతోందని ఆగ్రహం వ్యక్తం చేశా రు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ నళిని రంగయ్యగౌడ్, బొజ్జప్ప, మండల ఉపాధ్యక్షులు మూర్తి, జడ్పిటిసి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తిప్పేస్వామికి స్వాగతం పలుకుతున్న వైసిపి శ్రేణులు

సిఎంఒ కార్యాలయం చొరవతో ఆగిన బాల్య వివాహం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తనకి ఇష్టం లేకున్నా వివాహం జరిపిస్తున్నారని ఎలాగైనా ఈ పెళ్లి ఆపి, తాను చదువుకోవడానికి అవకాశం కల్పించండని ఓ మైనర్ బాలిక విన్నపానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి కార్యాలయం వేగంగా స్పందించి వెంటనే జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ఆ బాల్య వివాహాన్ని ఆపి సదరు బాలిక జీవితంలో వెలుగు నింపింది. అందుకు సంబంధించిన వివరాలు..శీ సత్య సాయి జిల్లా ఎన్‌పి కుంట మండలం, తిమ్మమ్మమర్రి మాను గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక(14)కు ఇష్టం లేకపోయినా ఆమె తండ్రి పెళ్లి చేయడానికి పూనుకున్నాడు. అందుకోసం బాలిక ఆధార్ కార్డులో వయస్సుని మార్పు చేసి వివాహం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని తాను చదువుకుం టాను అని ఎంత చెప్పినా వినకుండా 27న వివాహానికి ఏర్పాట్లు చేశాడు. దీంతో ఆబాలిక ఈ పెళ్లికి సంబందించిన వివరాలను సిఎంఒ కార్యాలయానికి సామాజిక మాధ్యమాల ద్వారా పంపింది. ఈ సంఘటనపై యుద్ధప్రాతిపదికన స్పందించిన కార్యాలయం శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డికి ఆ బాలిక వివరాలు పంపి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో జిల్లా ఎస్పీ వెంటనే స్థానిక పోలీస్ సిబ్బందికి, సంబంధిత ఎంపిడివో, ఐసిడిఎస్ అధికా రులను అప్రమత్తం చేశారు. దీంతో వారు బాలిక స్వగ్రామానికి వెళ్లి వివాహం నిలిపి వేసేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం బాలిక తల్లిదండ్రులకి పెళ్లి కుమరుడికి,వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వారి స్టేట్మెంట్ గ్రామ ప్రజల సమక్షంలో నమోదు చేసుకున్నారు. అనంతరం బాలిక అభీష్టం మేరకు వారి తల్లిదండ్రుల తోనే ఉంచి బాలిక విద్య కొనసాగిం చాలని సూచించారు. ఎవరైనా ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్పీ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో గాండ్లపెంట సిఐ మల్లికార్జున రెడ్డి, ఎంపిడిఒ ఆది నారాయణ, ఐసిడిఎస్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములవ్వాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థినులు ఉన్నత ఆశయంతో విద్యాభ్యాసం సాగించి, సమాజాభి వృద్ధిలో భాగస్వాములు కావాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పిలుపుని చ్చారు. శనివారం స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతు నేటి సమాజంలో చట్టాల పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినుల మహిళల కోసం ప్రత్యేకంగా ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన కల్పించుకుని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దీనికి తోడు తల్లితండ్రులు, గురువులను గౌరవిస్తూ ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో సాధన చేస్తే సాధించలేనిది ఏదీ లేదని సూచించారు. వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యలో రాణించాలన్నారు. ప్రతి ఒక్కరికి ఏదో ఒక రంగంపై అభిరుచి ఉంటుందని, దానిని సరైన మార్గంలో ఉంచి రాణించేలా నైపుణ్యతను పెంపొందించుకోవాలని అన్నారు. చట్టపరంగా అవసరమైన ఎలాంటి అవగాహన కల్పించేందుకు అయినా తాము సిద్ధంగా ఉంటామన్నారు. అనంతరం విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలు, నీటి ప్లాంటు తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎజిపి శ్రీనివాస్ రెడ్డి, న్యాయ వాదులు సంతోషి కుమారి, పార్వతి, నవేరా, ఎస్ఐ భాస్కర ప్రసాద్, లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, లోక్అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ఎడిజె కంపల్లె శైలజ

'యువగళం' పాదయాత్రలో సవితమ్మ

పెనుకొండ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఏలూరు జిల్లా నూజివీడు నియోజక వర్గంలో కొనసాగుతోంది. 195 రోజైన శనివారం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ లోకేష్‌తో పాటు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె లోకేశ్‌కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లోకేష్‌తో పాటు పాదయాత్రలో నడుస్తున్న సవితమ్మ

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పెనుకొండ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమా వేశం భవనంలో శనివారం ఎంపిపి జె.గీతా రామ్మో హన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని తూతూమంత్రంగా నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు మండల అధికారులు హాజరుకాలేదు. హాజరైన అధికారులు వారి శాఖలకు సంబంధించిన డేటాను చదివి వినిపించారు. వ్యవ సాయ, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్యం, ఉపా ధి హామీ, పశువైద్య, పంచాయతీరాజ్, హౌసింగ్, విద్య, సాంఘిక సంక్షేమ, హార్టికల్చర్, సిరికల్చర్, వెలుగు, స్త్రీ శిశుసంక్షేమం, చిన్న నీటి పారుదల శాఖల పరిధిలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల గురించి ఆయా శాఖల అధికారులు వివరించారు. సమావేశం ప్రారంభమైన గంటలోగానే ముగిసింది. ఎంపిపి మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ప్రజలు, రైతులు లబ్ధి పొందేలా చూడాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అవసరమైన సేవలను అందించాలని కోరారు. మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపిడిఒ శివశంకరప్ప, వైస్ ఎంపిపి రామాంజనేయులు, ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పావగడకు 'గుండుమల' పాదయాత్ర

మడకశిర : శ్రావణ మాసంలో రెండవ శనివారం సందర్భంగా నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పట్టణంలోని చంద్రమౌళే శ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక శివాలయం నుంచి పావగడలో వెలసిన శనీశ్వరస్వామి దర్శనార్థం కాలినడకన బయల్దేరి వెళ్లారు. పాదయాత్రగా పావగడ చేరుకొని అక్కడ శనీశ్వరస్వామి, సీతలాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి పుల్లయ్య చౌదరి, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, ఐటిడిపి తాలూకా ఉపాధ్యక్షుడు చంద్ర, శ్రీగాయత్రీ పాదయాత్ర బృందం సభ్యులు, మహిళలు తరలివెళ్లారు.

జిల్లా సర్వసభ్య సమావేశంలో రొద్దం సమస్యల ప్రస్తావన

ప్రజాశక్తి-రొద్దం

ఉమ్మడి అనంతపురం జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం అనంతపురం నగరంలోని జడ్పి సమావేశ హాలులో నిర్వశించారు. ఇందులో రొద్దం ఎంపిపి చంద్రశేఖర్ పాల్గొని మండల సమస్యలను ప్రస్తావించినట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా ఆయన రొద్దం ప్రభుత్వాసుపత్రి, ఎంజెపి బాలుర స్కూల్ బిల్డింగ్ పనులను పునాదులు, పిల్లర్ల స్థాయిలో వదిలేశారని తెలిపారు. ఆ పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు చదువుతున్నారని, తగిన వసతులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు.

ఖాద్రీశుని సన్నిధిలో ఎపి లోకాయుక్త జస్టిస్



ఎపి లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డికి ఖాద్రీశుని చిత్రపటం అందజేస్తున్న ఇఒ శ్రీనావాసరెడ్డి

కదిరి టౌన్ : ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ రెడ్డి కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. పి.లక్ష్మణ రెడ్డికి ఆలయ తూర్పు రాజగోపురము వద్ద నుండి పూర్ణకుంభంతో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస రెడ్డి, ఆలయ ఛైర్మెన్ జరిపిటి గోపాలక్రిష్ణ, ప్రధాన అర్చకులు ఎవి.నరసింహచార్యులు, డి.పార్థసారథి చార్యులు తదితరులు స్వాగతం పలికారు. స్వామి వారి చిత్ర పటము, శేషవస్త్రాలతో సత్కరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి పుట్టపర్తిలో ఓనం వేడుకలు.. గోవా గవర్నర్ రాక

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కేరళీయులకు ఇష్టమైన ఓనం పండుగ సందర్భంగా ప్రశాంతి నిలయంలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు వేడుకలు జరగనున్నాయి. ఎక్కువ మంది కేరళీయులు పుట్టపర్తి లోనే స్థిర నివాసం ఉన్నారు. ప్రతి ఏటా ఈ వేడుకలను వారి సంప్రదాయ పద్ధతులతో ప్రశాంతి నిలయంలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సత్యసాయి సమక్షంలో గతంలో జరుపుకునే వారు. ప్రస్తుతం సత్యసాయి సమాధి వద్ద ఈ వేడుకలను జరుపుకోనున్నారు. ఈ వేడుకలలో మొదటి రోజు గోవా గవర్నర్ పి ఎస్ శ్రీధరన్ పిళ్లై పాల్గొననున్నారు. గవర్నర్ బెంగళూరు నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు ప్రశాంతి నిలయం చేరుకుని సాయంత్రం ఓనం వేడుకల్లో పాల్గొని తిరిగి రాత్రి 7 గంటలకు ఇక్కడ నుంచి కర్నాటకకు బయలుదేరి వెళ్లనున్నారు. ఓనం వేడుకలను పురస్కరించుకుని కేరళ నుంచి కూడా సత్యసాయి భక్తులు రానున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు కేరళీయులు నిర్వహించనున్నారు.

సమస్యలు పరిష్కరించేదాకా ఆందోళనలు

చిలమత్తూరులో జలదీక్ష చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే అయితే ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో కార్మికులు శనివారం వినూత్న నిరసనకు దిగారు. చిలమత్తూరు చెరువులో జలదీక్షకు దిగారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర నాయకులు రమేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కార్మికులను రెగ్యులర్ చేయాలని వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. మూడు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని అన్నారు. 'మమ్మల్ని ముంచేశావు జగనన్న' అంటూ కార్మికులు నినాదాలు చేపట్టారు. అర్ధనగ్నంగా మండలంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వెంకటేష్,రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : తమ సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో పారిశుధ్య కార్మికులు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరసనను శనివారం కొనసాగించారు. ఈసందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న , సిఐటియు మండల కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, కార్మికులు తదితరులు చెవుల్లో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పును అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పారిశుధ్యకార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలోని పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె మూడవరోజైన శనివారం కూడా కొనసాగింది. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్షులు అక్కులప్ప, పారిశుధ్య కార్మికులు నరసింహులు, ఆంజనేయులు, కదిరప్ప, దొడ్డప్ప, శ్రీరాములు, ఆంజనేయులు, గంగులప్ప, గంగన్న తదితరులు పాల్గొన్నారు

పారిశుధ్య కార్మికుల వినూత్న నిరసన

తలుపుల, పరిగి మండలాల్లో కొనసాగుతున్న నిరసనలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

తలుపుల : సిఐటియు రాష్ట్ర పిలుపు మేరకు మేరకు పారిశుధ్య కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు 3వ రోజుకు చేరుకున్నాయి. పారిశుధ్య కార్మికులు వేతనాలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కిరణ్ వినతి పత్రం అందజేశారు.

పరిగి : స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు స్వచ్ఛభారత్ కార్మికులు చేస్తున్న సమ్మె మూడవరోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కార్మికులు మోకాళ్లపై కూర్చుని తమ నిరసనను తెలియజేశారు. కార్మికులు చేపట్టిన సమ్మెకు సిఐటియు మద్దతునిచ్చింది. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకుడు లింగారెడ్డి మాట్లాడుతూ కార్మికులు న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు సజ్జప్పతోపాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కొత్తచెరువు రూరల్: తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన కొత్తచెరువు మండల పరిధిలోని మీర్జాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఎస్ రామచంద్రారెడ్డిని పరామర్శించారు. ఆయన అనారోగ్య కారణంగా అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అంతేకాక పుట్టపర్తి మండల పరిధిలోని కోవెల గుట్టపల్లి కి చెందిన కౌన్సిలర్ లక్ష్మీ నరసమ్మ భర్త డి రామకృష్ణ ప్రమాదవశాత్తు గాయపడి అనంతపురంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పల్లె రఘునాథ్ రెడ్డి అక్కడికి వెళ్లి ఆయన్ని పరామర్శించి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

కొత్తచెరువు : టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. మండల పరిధిలోని మీర్జాపురం, కొత్త దేవరపల్లి, పాత దేవరపల్లి, బంగారు చెన్నేపల్లి గ్రామాలలో మహాశక్తి రథం ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు సురేష్, సుబ్రహ్మణ్యం, అంజన్ రెడ్డి, కేసప్ప, సుధాకర్, మాధవి, రాధ, తులసి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నల్లచెరువు : మండల పరిధిలోని యర్రగుంట్లపల్లిలో అధికారులు మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కదిరి మలేరియా సబ్‌యూనిట్ అధికారులు రామాంజనేయులు,మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ రామచంద్రారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణ రెడ్డి, ఆశా కార్యకర్తలు ఉమా, లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమ పాలన

బుక్కపట్నం : వైసిపి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమ పాలన సాధ్యమవుతోందని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ రమణారెడ్డి, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి , వైస్ ఎంపీపీ ఆదినారాయణ ,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని సుబ్బరాయనపల్లిలో చేపట్టిన శ్రీరామ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలుగుదేశం హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సామకోటి ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం సుబ్బరాయన పల్లిలో దేవాలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలించి భూమి పూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి తనవంతుగా 20వేల రూపాయలు విరాళం అందజేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బొమ్మయ్య, లింగమయ్య, ఆనంద్, జయచంద్ర, కేశవ, రాజప్ప, శంకరప్ప, రంగస్వామి, సతీష్, రఘువరన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

కదిరి టౌన్ : కదిరి మున్సిపాలిటీ కొలిమి వీధి లో నూతనంగా జరుగుతున్న సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణపనులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి శనివారం పరిశీలించారు. తనకల్లు మండలం పరాకువాండ్లపల్లె కి చెందిన అల్లాబకష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుమారుడు చాంద్ బాషా కి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించారు . దీంతో వారు ఎమ్మెల్యే సిద్దా రెడ్డి ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి తాగునీటి పథకానికి నిధులు కేటాయించాలి

ఆందోళనలో మాట్లాడుతున్న ఇఎస్. వెంకటేష్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి నీటి పథకం నిర్వహణకు ప్రభుత్వం నిధులను కేటాయించి ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. సత్యసాయి కార్మికులు రెండవ రోజు పుట్టపర్తి పంప్ హౌస్ వద్ద నిర్వహించిన నిరవధిక సమ్మెలో ఇఎస్ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సత్యసాయి నీటి పథకం ద్వారా సుమారు 1000 గ్రామాలకు, 10 లక్షల జనాభాకు, 572 మంది కార్మికులు కష్టపడి తాగునీటిని అందిస్తున్నామన్నారు. కార్మికుల పట్ల కనికరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. అధికారుల అశ్రద్ధ వల్లనో, ప్రభుత్వ నిర్లక్ష్యమో, నిధుల్లేని పరిస్థితితో బడ్జెట్ కేటాయింపు . బిల్లుల గురించి ఏలాంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరపవద్దని ప్రభుత్వం మెమో కూడా జారీ చేయడం బాధాకరమన్నారు. కార్మికులకు సుమారు 5 నెలల నుండి వేతనాలు లేవని ఎప్పుడు వేతనాలు ఇస్తారో, ఏలా ఇస్తారో, ఏ విషయము చెప్పలేని పరిస్థితిలో సంబందిత అధికారులు ఉన్నారన్నారని విమర్శించారు. పైపుల మరమత్తులకు అవసరమయ్యే మెటరియల్ నుండి పిల్టర్ చేసే ఇసుక, ఆలం, క్లోరిన్ వంటి అనేక రకాల అవసరాలకు ఖర్చు చేయడానికి తగిన బడ్జెట్ కేటాయించాలన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ఉద్దేశ్యం లేనప్పటికీ తప్పని సరి పరిస్థితులలో విధులను నిర్వర్తించ లేని స్థితికి చేరుకున్నామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 25 వ తేదీ నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్లినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు మధుసూదన్, నరేష్, రాము, బాబ్జాన్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : వేతనాలు చెల్లించాలని కోరుతూ సత్య సాయి తాగునీటి పథకం కార్మికులు శనివారం ముదిగుబ్బ లోని సత్యసాయి పంప్ హౌస్ ఎదుట నిరసన చేపట్టా రు. ఐదు నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ధర్మానాయక్, మల్లయ్య, రాజశేఖర్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బాబ్జాన్, బాబావలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

బాబ్జాన్

బాబావలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన అధ్యక్షులుగా బాబ్జాన్ ఎంపికయ్యారు. ఈనెల 24 24 తేదీలలో కదిరి పట్టణంలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ 5 వ జిల్లా ప్లీనరీ సమావేశాలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు బాబ్జాన్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామని అన్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షులుగా నియమించినందుకు రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

హిందూపురం : ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శిగా లేపాక్షి మండలం శిరివరం గ్రామానికి చెందిన బాబావలి ఎంపికయ్యారు. ఈసందర్భంగా బాబావలి మాట్లాడుతు కదిరిలో ఈ నెల 24, 25న జరిగిన జిల్లా ప్లీనరీలో 19మందితో నూతనంగా కమిటీ ఎన్నుకున్నామన్నారు. జిల్లా అధ్యక్షులుగా కదిరికి చెందిన బాబ్జాన్ ఎంపిక కాగా జిల్లా కార్యదర్శిగా ఐదవ సారి తనను ఎంపిక చేశారన్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ అవకాశం కల్పించారని, వారి నమ్మకానికి అనుగుణంగా విద్యార్థి సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటాలను చేస్తామని అన్నారు.

రైతుల సమస్యలపై ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న డిఇ భాస్కర్‌రెడ్డి

పంట పొలాలకు సాగునీరు విడుదల

ప్రజాశక్తి బుక్కపట్నం

బుక్కపట్నం చెరువు కింద రైతుల పంట పొలాలకు సాగునీరు విడుదలకు పంచాయతీరాజ్ డిఇ భాస్కర్ రెడ్డి తనవంతు కృషి చేశారు. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు స్థానిక పంచాయతీరాజ్ డిఇ భాస్కర్ రెడ్డికి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన ఆయన రైతులతో కలిసి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డితో మాట్లాడారు. రైతులను నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రైతుల సౌకర్యం కోసం నీరు వదలాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా క్వారీలు ఏర్పాటు చేస్తే ఊరుకోం : పరిటాల

క్వారీని పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్, తదితరులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

గ్రామస్తుల అనుమతి లేకుండా కంకర క్వారీలు ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ హెచ్చరించారు. తాడిమర్రి మండలం పిన్నదరి గ్రామంలో వైసిపి నాయకులు స్థానిక గ్రామస్తులకు ఎలాంటి సమాచారం లేకుండా అక్రమ కంకర క్వారీతో పాటు కంకర క్రషింగ్ మిషన్ ఏర్పాటు చేయడంపై శ్రీరామ్ తీవ్రంగా స్పందించారు. శనివారం స్థానిక రైతులతో కలిసి కంకర క్వారీలు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. క్రషర్ యూనిట్స్ ఏర్పాటు చేస్తే ఎంత మేర ప్రభావం ఉంటుందన్నది శ్రీరామ్ ఆరా తీశారు. అలాగే 10 గ్రామాలకు ఆరాధ్య దైవంగా ఉన్న పురాతనమైనటువంటి అక్కమ్మగార్ల ఆలయాన్ని కూడా సందర్శించారు. గ్రామస్తులు ఇక్కడ కంకర క్వారీలు ఏర్పాటు చేస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుందని శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఈ విషయం మీద జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో కూడా ఫిర్యాదు చేశామని వివరించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ పిన్నదరి గ్రామ పంచాయతీ సర్వే నెంబర్ 335 లో గ్రామ ప్రజలకు ఎటువంటి సమాచారం లేకుండా, ప్రజల అభిప్రాయాన్ని సేకరించకుండా సుమారు 3 హెక్టార్ల విస్తీర్ణంలో అధికార పార్టీ నాయకులు క్వారీ, క్రషర్ మిషన్ ఏర్పాటు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ క్వారీ, క్రషర్ మిషన్ వేస్తే క్వారీలో బ్లాస్టింగ్ చేసినపుడు పంటపొలాల్లో పనిచేస్తున్న కూలీలు ప్రమాదానికి గురవడంతో పాటు , రైతుల పంట పొలాల్లోని డ్రిప్, స్ప్రింక్లర్లు, వ్యవసాయ మోటర్లు కూడా నాశనమవుతాయన్న ఆందోళన చెందారు. క్రషర్ స్టార్ట్ చేసినపుడు విపరీతంగా ధూళి, చిన్న ఇసుక రేణువులు పంట పొలాల మీద పడి పంట ఎదుగుదలకు ఆటంకం కలుగుతుందన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో దాదాపు 1000 ఎకరాల విస్తీర్ణంలో దానిమ్మ, చీని, బొప్పాయి, వేరుశెనగతో పాటు కూరగాయలు పండిస్తున్నారని వీరికి కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. మరోవైపు ఇక్కడ సుమారు పది గ్రామాల ప్రజలు ఆరాధ్య దైవంగా భావించే అక్కమ్మ గార్ల గుడి ఈ కొండకు అనుకొని ఉందని.. ఈ ఆలయం కూడా క్వారీల కారణంగా దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నారు. ఇది గ్రామాల ప్రజల మనోభావాలు దెబ్బతీయటమేనని శ్రీరామ్ అభిప్రాయపడ్డారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని, ఇప్పటికైనా దీనిపై జిల్లా కలెక్టర్, అధికారులు స్పందించి క్వారీలు క్రషర్ యూనిట్లకు అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. రైతులకు వ్యతిరేకంగా ఎలాంటి కార్యక్రమాలు చేసిన కచ్చితంగా వాటిని అడ్డుకుంటామని శ్రీరామ్ హెచ్చరించారు..

దండన తప్పదా.. ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకుంటే ఏ విధంగా ఉంటుందో తెలియజేసే ఘటన జిల్లాలో చోటు చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఎన్నికల విధులంటే ఇప్పటి వరకు ఏముందిలే అనుకుని సాదాసీదాగా తీసుకునే వారికి ఇప్పుడు జిల్లాలో జరుగుతున్న పరిణామాలు ఆందోళన, భయాన్ని సృష్టించే విధంగా ఉంటున్నాయి. ఈ వారంలో వరుసగా ఇద్దరు జిల్లా స్థాయి అధికారులపై వేటు పడింది. ఓటర్ల జాబితాలో నుంచి ఓట్లను తొలగించే అంశాన్ని ఇది వరకులాగానే వారు కూడా ఆషామాషీగా తీసుకున్నారు. కింది స్థాయి సిబ్బంది ఇచ్చిన నివేదిక ఆధారంగా సంతకాలు చేసేశారు. తీరా చూస్తే ఇప్పుడు వారు కూడా శిక్ష అనుభవించక తప్పని పరిస్థితి నెలకొంది. జిల్లాలో గతంలో ఎన్నడూ ఈ రకమైన పరిస్థితిని అధికారులు ఎదుర్కొన్న దాఖలాల్లేవు. ఏదైనా ఉంటే బూత్ లెవల్ అధికారుల వరకే చట్టపరమైన చర్యలు ఉండేవి. ఇప్పుడు జిల్లా స్థాయి అధికారులకు కూడా అవి తాకడంతో అందరిలోనూ గుబులు రేగుతోంది. గతంలోలాగా ఎన్నికల విధుల్లో అశ్రద్ధగా ఏ మాత్రం వ్యవహరించినా వేటు పడక తప్పదన్న హెచ్చరిక అయినట్టయింది. జిల్లాలో గత వారంలో వరుసగా ఇద్దరు జడ్పి సిఇఒలు సస్పెన్షన్‌కు గురయ్యారు. అంతక మునుపు మొత్తం ఎనిమిది మంది బూత్ లెవల్ అధికారులపై వేటు పడింది. వీరు చేసిందల్లా పూర్తి స్థాయి విచారణ లేకుండానే ఆరు వేల ఓట్లను తొలగించారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు వెళ్లడంతో దర్యాప్తు చేపట్టి చర్యలకు ఉపక్రమించింది. ఇప్పుడు సస్పెన్షన్ ప్రాథమిక విచారణలో భాగమేనని చెబుతున్నారు. అసలు విచారణ రాబోయే రోజుల్లో ప్రారంభమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందులో అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారులుగానున్న తహశీల్దార్ల వరకు కూడా వచ్చే అవకాశమున్నట్టు చర్చ నడుస్తోంది. ప్రస్తుతం కేవలం బూత్‌లెవల్ అధికారులు, ఆపైన ఎలక్టోరల్ అధికారుల వరకే వెళ్లింది. పూర్తి స్థాయి దర్యాప్తు జరిగితే మరింత మందిపైకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఓట్ల తొలగింపుపై సీరియస్‌గానే దృష్టి సారించినట్టు కనిపిస్తోంది. ఇక ఈ వారంలో అవినీతి నిరోధక శాఖ సైతం అధికారులపై వేటు వేసింది. కూడేరు మండల వ్యవసాయాధికారి రూ.15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబట్టాడు. అంతక మునుపు సబ్ రిజిస్ట్రారు కూడా లంచం తీసుకుంటూ పట్టుబట్టారు. ఇలా ఎన్నికల సంఘం ద్వారా వేటుపడింది కొందరికైతే... అవినీతికి పాల్పడుతూ ఏసిబికి చిక్కడం రెండు ఘటనలు జరిగాయి. ఉద్యోగంలో నున్న వారు ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గి పనిచేసినా ఇబ్బందులు ఎదుర్కొనేది మాత్రం తామేనన్నది తెలుసుకోవాలని ఇది సూచిస్తోంది. ఈ వారంలో కరువుపైనా పెద్ద చర్చ జరుగుతోంది. మూడేళ్ల తరువాత వర్షాభావం పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్ సమస్య సైతం దానికి తోడైంది. వ్యవసాయానికి విద్యుత్ కోతలుంటుండటంతో పంటలు ఎండిపోతున్నాయి. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నాడు 14 మండలాల్లో సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నా చేపట్టారు. ప్రకృతి వైపరీత్యంతో పంటలు ఎండిపోతుంటే, విద్యుత్ సమస్యతో మరో రకంగా రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది.అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసామని చెబుతున్నా ఆచరణలో కనిపించడం లేదు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పరిగి : మండలంలోని హొన్నంపల్లిలో డ్రయినేజీ నిర్మాణం కోసం తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు పట్టుకున్నారు. అయితే తను తరలిస్తున్న ఇసుకకు అధికారుల నుండి అనుమతులు ఉన్నాయని ఎలా జప్తు చేస్తారని అధికారులతో వాదనకు దిగడంతో కొద్దిసేపు వైసిపి నాయకులకు సెబ్ అధికారులకు వాదనలు జరిగాయి. ఇసుక తలింపునకు ప్రస్తుతం ఇక్కడ అనుమతులు ఇవ్వడం లేదని తమకు ఇచ్చిన అనుమతులు నామమాత్రపు అనుమతులేనని ఇసుక ట్రాక్టర్లు తమకు అప్పజెప్పాలని సెబ్ అధికారులు తెలిపినప్పటికీ అందుకు అంగీకరించని వైసిపి నాయకులు ట్రాక్టర్‌ను వనంపల్లికి తీసుకెళ్లారు. అయినప్పటికీ అధికారులు ట్రాక్టర్ ను వెంబడించి స్టేషన్‌కు తీసుకెళ్లాలని హెచ్చరించినా నాయకులు పట్టించుకోలేదు. డ్రయినేజీ పనులు చేస్తున్న స్థలం వద్ద ఉన్న ఇసుకను లోడ్ చేసి పరిగి పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. దీంతో సేబ్ అధికారులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు అప్పచెప్పారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

బత్తలపల్లి : తాడిమర్రి మండలం కునుకుంట్ల గ్రామానికి చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గుజ్జల రామ్మోహన్ గురువారం విద్యుత్ షాక్ తో మృతిచెందాడు. ఈ మేరకు రామ్మోహన్‌ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ కార్యక్రమలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ధర్మవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఐను కలిసిన నాయకులు

ముదిగుబ్బ : సిఐ యతీంద్రను పలువురు నాయకులు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ క్లస్టర్ కన్వీనర్ తుమ్మల మనోహర్, జెడ్పీటీసీ తిరుమల సేవే నాయక్, సిపిఎం కార్యదర్శి ఆటో పెద్దన్న సిఐటియు మండల అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, బలిజ , రజక , సంఘాల నాయకులు తదితరులు సిఐను కలిశారు ఈ సందర్భంగా సిఐ మండల వ్యాప్తంగా ఉన్న సమస్యలపై వారితో చర్చించారు.

కిక్కిరిసిన ఖాద్రీశుడి ఆలయం

కదిరి టౌన్ : ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం భక్కులతో కిక్కిరిసింది. శ్రావణ మాసం రెండవ శనివారము వారంతపు సెలవులు కావడంతో స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కర్నాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ఉంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణముతో పాటు తీరుమాడ వీధులు నిండిపోయాయి.

మదర్‌థెరిసా జయంతి

కొత్తచెరువు : శాఖ గ్రంథాలయంలో మదర్ థెరిసా 111వ జయంతిని గ్రంధాలయ అధికారి జయరాం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెటర్నరీ అసిస్టెంట్ డైరక్టర్ మల్లేష్ గౌడ్ హాజరయ్యారు. ఈసందర్భంగా మదర్ థెరిస్సా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి నరేష్, అటెండర్ వెంకటరమణప్ప, స్వీపర్ మునీర్, పాఠకులు మహమ్మద్, రామాచారి, అమృత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ

పుట్టపర్తి రూరల్: శ్రీ వాణి బ్లో సమ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. పుట్టపర్తి మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ,అంగన్వాడీ కేంద్రంలోని విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలను , పలకలు, జామెంట్రీ బాక్సులు, సత్యసాయి ఫోటోలు అందజేశారు. వీటిని విద్యార్థులకు అందించడానికి విదేశీ మహిళలు మీరా, రాధా, కేసరి, సహకరించినట్లు సంస్థ ప్రతినిధి శ్రీవాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాల పరిసర ప్రాంతాలు, నివాసాల వద్ద పరిశుభ్రంగా ఉంచుకోవాలని ,ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపేందుకు, విద్యార్థులుమంచి ప్రవర్తన అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లలితా జవహర్‌లాల్, ఏచూరి శ్రీవాణి, శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం కాలసముద్రంలోని బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. పట్నం మెడికల్ ఆఫీసర్ ప్రమీల, నిరోష , లక్ష్మి బృందం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

'టిడిపితోనే మహిళల భవిష్యత్తుకు భరోసా'

హిందూపురం : టిడిపితోనే మహిళల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పరిమళ అన్నారు. మహిళా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని మాడల్ కాలనీలో మహాశక్తి మ్యానిఫెస్టో ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా కరపత్రాలను మహిళలకు పంపిణీ చేస్తు, మహాశక్తి వర్తించే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి వెంకటేష్, వార్డు ఇన్‌చార్జి దేశాయి మురళి, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి వెంకటలక్ష్మి, సీమ, అరుణమ్మ, గంగమ్మ, అయుబ్, మజీద్ ఖాన్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తిలక్‌నగర్‌లో ఉచిత వైద్యశిబిరం

హిందూపురం : పట్టణ పరిధిలోని తిలక్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో శనివారం వాసవ్య మహిళా మండలి, కుశాల్ హెల్త్ కేర్ క్లినిక్, విప్రో కేర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు చక్ర తేజారెడ్డి మాట్లాడుతు ప్రజలు అనారోగ్యంతో ఉన్నప్పుడు పరీక్షలు చేయించుకొని, చికిత్స చేయించుకోవడం మంచిదన్నారు. వ్యాధిని సత్వరమే గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్స అందించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కుశాల్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ్ కుమార్, వైద్య సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, గ్రామ సర్పంచి, ఎఎన్‌ఎం పుష్ప, ఆశవర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సేవలు

కదిరి టౌన్ : ప్రయాణికులకు ఆర్టీసీ తరపున మెరుగైన సేవలు అందిస్తామని కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. డిఎం కార్యాలయంలో కదిరి డిపో నందు అన్ని విభాగ అధిపతులతో సమావేశం నిర్వహించారు. గత ఏడాది కంటే ఈసారి కదిరి డిపోలో ఉద్యోగుల కృషితో ఖర్చు తగ్గిందని అన్నారు. బస్సు ఇంజన్ల జీవితకాలం పెంచుతున్న అసిస్టెంట్ ఇంజనీరు రామక్రిష్ణ సేవలను అభినందించారు. ప్రయాణీకుల అభిప్రాయం మేరకు బస్సులు నడపాలని, తరచుగా ప్రయాణికులతో సంత్సంబందాలు పెట్టుకుని, తెలుగువెలుగు సర్వీసుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అద్దె బస్సుల యజమానులు చెప్పిన సమస్యలను విని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామనిహామీ ఇచ్చారు. తెలుగు బాష వారోత్సవముల సందర్భముగా ప్రతి ఆఫీసులోను తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరములు నిర్వహించాలని ఆదేశించారు. ఉద్యోగులకు మంచి సేవలందిస్తున్న అసిస్టెంట్ మేనేజరు మోక హరిమోహన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కడప జోన్ డిప్యూటి చీఫ్ మెకానికల్ ఇంజనీరు మోహన్ కుమార్, డిపోమేనేజరు బి.మైనుద్దీన్, అసిస్టెంట్ మేనేజర్లు హరిత, హరిమోహన్, సూపర్వైజర్లు నబీరసూలు, నాగప్ప, యాకూబ్ ఖాన్, బాలునాయక్, నాగసుబ్బయ్య, అసోషియేషన్ నాయకులు ఎన్‌వి.రమణ, ఆర్‌ఎస్.రెడ్డి, గంగరాజు, నారాయణస్వామి, ఆఫీసు సిబ్బంది రియాజ్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

సెబ్ స్టేషన్‌కు తాళాలు

హిందూపురం : సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో 24గంటలకు విధులు నిర్వహించే వాటిని ఎట్టి పరిస్థితుల్లోను మూసి వేయరు. అత్యవసర విధులు నిర్వహణ సమయంలో సైతం తప్పని సరిగా కనీసం ఒక సెంట్రీని అయిన విధుల్లో ఉంచడం చేస్తారు. అయితే హిందూపురం సెబ్ స్టేషన్ మాత్రం దీనికి విరుద్దం ఉంది. ఎప్పుడు పడితే అప్పుడు డోర్ మూసి, తాళాలు వేయడం పరిపాటిగా శనివారం సైతం ఉదయం 8.30గంటల సమయంలో సెబ్ స్టేషన్ మూసి వేసి తాళలు వేశారు. ఏదైన అర్ధరాత్రి సమయంలో అయితే తలుపులు మూసి, లోపల ఉంటారని సర్ది చెప్పుకోవచ్చు. చివరకు ఉదయం అన్ని ప్రభుత్వ కార్యలయాలు తెరచుకునే సమయంలో సైతం సెబ్ స్టేషన్ మూసి వేసి, తాళాలు వేసి ఉండటం గమనార్హం.

నిందితులు ఉండడంతో తాళాలు వేశాం : స్టేషన్‌లో నిందితులు ఉండడంతో భద్రత కోసం స్టేషన్‌కు తాళాలు వేశామని గతంలో నిందితులు తప్పించుకోవడానికి ప్రయత్నం చేయడంతో అప్పటి నుంచి తాళాలు వేస్తున్నామన్నారు.